కిటికీ రెక్కలు టపటపలాడాయి. బార్లా తెరుచుకున్న కిటికీలోనుంచి గాలి విసురుగా లోపలకు వచ్చింది. టేబుల్ మీదున్న కాగితాలు లేచి గదంతా వాలాయి. వాటితోపాటే అప్పారావు చివుక్కున కుర్చీలోనుంచి లేచాడు. కిటికీ రెక్కలు మూసాడు. అద్దాలలో నుంచి బయటికి చూశాడు. కళ్ళు చూడలేని వెలుగు, చెవులు భరించలేని శబ్దం. నేలమీద వడగళ్ళ మోత. ఉరుములు, మెరుపులు, గాలీ–వాన. అప్పారావు గదిలో చెల్లాచెదరుగాపడి ఉన్న కాగితాలు ఏరి టేబుల్ మీద అమర్చాడు. రాసిన కాగితాలను పేజీల వారిగా పేర్చాడు. చివరి పేరా చదువుకున్నాడు. కలం తీసి ముందుకు వంగాడు.

ఊహూ! థాట్ బ్రేక్ అయింది? కలం ముందుకు సాగడంలేదు. నాలుగు పేజీలు వెనక్కు వెళ్ళి చదవ సాగాడు.

"స్వప్న డన్‌లప్ బెడ్ మీద నుంచి ఎగిరి కిందకు దూకింది. కింద పడుతున్న స్వప్నను అమాంతం తన చేతుల్లో బంధించాడు జితేంద్ర. ఆమె ముఖంలో ముఖం పెట్టి కళ్ళతో కళ్ళు కలిపాడు. ఆమె కళ్ళు తేలవేసి నోరు తెరిచింది. అలా తెరిచిన నోరును తన పెదవులతో నొక్కి మూసివేశాడు. జితేంద్ర, స్వప్న వేయబోయిన గావు కేక, మృదుమధురమైన ముద్దులశబ్దంగా మారిపోయింది. అతని వెచ్చని కౌగిలిలో కరిగిపోయిన స్వప్న, కొంత సేపటికి తేరుకొని "జిత్! డియర్! ఇంత రాత్రిపూట నా గదిలోకి ఎలా రాగలిగావు? ఎంత సాహసం డార్లింగ్" అన్నది.

జిత్ అదోలా చూసి మరోలా నవ్వాడు. "డార్లింగ్ నాకు సాధ్యం కానిదేముంది?" అంటూ జితేంద్ర స్వప్నను మరోసారి— కాని ఈసారి అతని పెదవులు ఆమె పెదవుల్ని తాకక ముందే ఆమె వెర్రిగా అరిచింది.

గజగజ వణికిపోతూ "నువ్వెలా వచ్చావ్"? ఈ గది తలుపు లోపల వేసి ఉంది. వేసిన బోల్ట్ వేసినట్టుగానే ఉంది. నువ్వు లోపలకు ఎలా ప్రవేశించావ్?

"పిచ్చి పిల్లా! అదేమిటి? నేనే లోపలకు వచ్చాక తలుపు బోల్ట్ వేసి ఉండవచ్చుగదా?"

"అయితే నీకు తలుపు ఎవరు తెరిచారు?"

ఆ ప్రశ్న వింటూనే అతడి కళ్ళు కుంపటి నిప్పులా కణకణలాడాయి. "నువ్వే తీసి ఉండొచ్చుగా?"

ఆమె ఆ మాటకు అదిరిపడింది.

"అబ్‌సర్డ్! నేనా? అసంభవం!" ఆమె అతనికి దూరంగా జరిగింది

"నువ్వే డియర్!" అంటూ అతను ఆమెను సమీపించాడు.

"నో నో! నన్ను పిచ్చిదాన్ని చేస్తున్నావ్, నేను తలుపు తియ్యలేదు."

"బహుశా నువ్వు నిద్రలోనే లేచి నీకు తెలియకుండానే తలుపు తెరిచి, మళ్ళీ వెళ్ళి పడుకుని ఉండవచ్చుగా?"

"జిత్! నువ్వేం మాట్లాడుతున్నావ్? నేను స్లీప్‌వాకర్‌ను అని సజెస్ట్ చేస్తున్నావా?"

జితేంద్ర అదోలా నవ్వాడు.

స్వప్నకు వళ్ళు జల్లుమన్నది.

"ఏమిటి అలా నవ్వుతున్నావ్? అసలు ఎవరు నువ్వు? జితేంద్రవేనా?"

"కాక? మరుక్షణంలో వచ్చిన మాయల ఫకీరు అనుకున్నావా? హ్హ హ్హ!"

"నేను బాలనాగమ్మను కాదు"

"అయితే గాళ్ళ సంగువా?"

"స్టాపిట్! ముందు నువ్వెవరివో చెప్పు! ఈ గదిలోకి ఎలా రాగలిగావో చెప్పు! లేకపోతే గట్టిగా అరుస్తాను. మా వాళ్ళంతా లేస్తారు".

"ఆ భయం నీకు అక్కర్లేదు, వాళ్ళు లేరు."

"ఎందుకనీ? మా అమ్మ .... నాన్నా.... అందర్నీ" స్వప్న కంఠం ఎవరో నొక్కుతున్నట్టు కీచుమన్నది.

"డార్లింగ్! నేను మీ వాళ్ళను ఏమీ చెయ్యలేదు. నేను చెప్పేది జాగ్రత్తగా విను. ఇదంతా ఆ శరభయ్య మాంత్రికుడి పని. నీ క్లాస్‌మేట్ మూర్తి ఉన్నాడే – వాడే చేయిస్తున్నాడు ఇదంతా. నువ్వు వాడి ప్రేమను తిరస్కరించినప్పటినుంచి నిన్ను ఎలాగయినా నాశనం



చెయ్యాలని చూస్తున్నాడు. శరభయ్య [illegible]త మీ ఇంట్లో వాళ్ళందరికీ చేతబడి చేయించాడు. ఆ దుర్మార్గుడి బారినుంచి నిన్ను రక్షించుకునే ఈ సమయంతో నేను వచ్చాను."

"ఓ డియర్ !" స్వప్న అతన్ని పెనవేసుకొని బావురుమన్నది.

"ఈజీ డార్లింగ్ ఈజీ!" ఆమెను అతను దగ్గరకు తీసుకొని మస్తకం నిమిరాడు. అతను అలా తన శరీరాన్ని తాకుతుంటే ఆమె మనసును ఏదో చుట్టేసింది.

"అయితే డార్లింగ్ ! నాదొక చిన్న సందేహం ! ఆ మాంత్రికుడు శరభయ్య తన మాంత్రిక శక్తితో నా చేత తలుపు తీయించాడే అనుకో, కాని మెయిన్ డోర్ ఎవరు తెంచారు ?"

"అదా !" జితేంద్ర ఇంటికప్పు కేసి చూశాడు.

"ప్లీజ్ డియర్ ! నాకేదో భయంగా ఉంది. త్వరగా చెప్పు !"

"చెబితే ఇంకా భయపడతావేమో ?"

"సస్పెన్స్‌తో ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నాను. ప్లీజ్ త్వరగా చెప్పు !"

"అదుగో ఆ బాత్‌రూం నుంచి వచ్చాను."

"బాత్‌రూమ్‌లో నుంచా? ఎలా? కాని తలుపు ఈ గదిలో నుంచే ఉన్నది. వేరే మార్గం లేదు. ఏమిటో నాకంతా అయోమయంగా ఉంది "

"రా చూపిస్తాను" జితేంద్ర స్వప్నను బాత్‌రూమ్‌లోకి తీసుకెళ్ళాడు.

"ఇదిగో! ఇటుచూడు!"

"ఇందులో నుంచా? కామోడ్‌లో నుంచి మనిషి ఎలా బయటకి వస్తాడు?"

"యు స్టుపిడ్ గర్ల్! డ్రైనేజ్ గొట్టంలో నుంచి వచ్చాననుకుంటున్నావా? వాట్ ఏ డర్టీ థింగ్! అదిగో అటుచూడు !"

"వెంటిలేటర్ నుంచా? అందులో చెయ్యి కూడా పట్టదు. మనిషి ఎలావస్తాడు? గాలి తప్ప అందులో నుంచి మరేదీ రాలేదు."

"సరిగ్గా అదే జరిగింది."

"అంటే?"

"గాలిగా మారివచ్చాను."

"గాలా?" స్వప్న నిలువు గుడ్లు వేసి చూసింది.

"అవును! మనిషి గాలిగా మారిపోవడం నువ్వు ఎప్పుడూ వినలేదా ?"

"లేదు—లేదు." అంటూ అరుస్తూ స్వప్న గదిలోకి పరిగెత్తుకొచ్చి మంచానికి అడ్డంగా పడిపోయింది.

జితేంద్ర ఆమె పక్కన కూర్చున్నాడు.

"స్వప్నా! బి బోల్డ్! భూత ప్రేత పిశాచాలను లొంగదీసుకోవాలంటే గుండె నిబ్బరం కావాలి. తాంత్రిక శక్తులను సాధించాలంటే సాధన కావాలి."

"అవన్నీ అభూతకల్పనలు' నేను నమ్మను"

"అయితే నేను ఎలా వచ్చాననుకుంటున్నావ్ ?"

ఆమె బిత్తరపోయి చూసింది.

"నువ్వు దెయ్యాలున్నాయనినమ్ముతావా"

"నా చిన్నప్పుడు మా పెద్దత్తయ్యకు దెయ్యం పట్టింది"

"అయితే దెయ్యాన్ని చూశావా?"

"చూడలేదు, మా అత్తయ్యకు గాలిసోకింది అనేవాళ్ళు."

"అంటే దెయ్యం గాలిలో వచ్చి మా అత్తయ్యను పట్టుకొందన్న మాట!"

స్వప్న బెదురుగా చూసింది.

"అంటే మనిషి చచ్చి దెయ్యం అవుతాడు. దెయ్యం గాలి అవుతుంది"

స్వప్నకు చెమటలు పట్టాయి. బిత్తర చూపులు చూసింది.

"సో రివర్స్ ఇట్! థీసిస్ అండ్ యాంటీ థీసిస్-గాలి దెయ్యం అవుతుంది దెయ్యం మనిషి అవుతాడు."

"అది చచ్చినవాళ్ళ సంగతి— బతికున్నవాళ్లు గాలి ఎలా అవుతారు?" ఆమె కంఠంలో వణుకు.

"చచ్చినవాడు దెయ్యం కాగలిగినప్పుడు, బతికి ఉన్నవాడు దెయ్యం ఎందుకు కాలేడూ? చచ్చినవాడి కంటే బతికున్నవాడు ఎక్కువ శక్తిమంతుడేగదా? తాంత్రిక శక్తులను పొందగలిగినవాడికి ఇది సాధ్యం అవుతుంది"

"అయితే-నువ్వు-నువ్వు గాలిగా మారిపోగలవా" జంకుతూనే అడిగింది.

"మారిపోగలను ! కాని ఇప్పుడు యిక్కడ సాధ్యం కాదు దానికి మళ్ళీ క్షుద్ర ఆరాధన చెయ్యాలి అదీ అర్ధరాత్రి శ్మశానంలో చేయాలి. చితిమీద కాలుతున్న శవం కపాల మోక్షం జరగ్గానే దాని మెదడును, దిగంబరంగా, ఒంటికాలిమీద నలబడి, కాలభైరవుణ్ణి పూజించి ఆరగించాలి. ఆ సమయంలో అనేక క్షుద్రదేవతలు, భూతప్రేత పిశాచాగణాలు చుట్టూ చేరి హాహాకారాలు చేస్తున్నా బెదిరిపోకూడదు."

స్వప్నా వెర్రిగా అరిచి స్పృహతప్పి పడిపోయింది."........

కిటికీ అద్దాలు పగిలి గదిలో మీద పడ్డాయి !

అప్పారావు కుర్చీలోనుంచి ముందుకు పడ్డాడు.

చేతిలోని కాగితాలు కిందకు జారాయి.

అద్దాలు పగిలిన కిటికీ రెక్కలు టపా టపా కొట్టుకుంటున్నాయి.

గాలీ వానా విసిరి విసిరి లోపలకు వీస్తుంది.

"అప్పారావ్ ! అప్పారావ్ !" హోరులో పిలుపు వినిపించింది.

అప్పారావు వళ్ళు జలదరించింది.

గుండెలు బిగిసిపోయాయి.

అతను కష్టంమీద లేచి కిటికీ దగ్గరకు వచ్చాడు. "అప్పారావ్ ! అప్పారావ్ !" అదే పిలుపు.

"ఎవరది ?" గొంతు పెగల్చుకొని అన్నాడు అప్పారావు.

"నేనే రా ! సుబ్బారావుని ! తలుపు తియ్"

"సుబ్బారావా ?" అప్పారావ్ గొంతు కీచ్‌మన్నది,

"అవున్రా ! సుబ్బారావునే !"

"ఎలా .... ఎలా .... వచ్చావ్ ?"

"కృష్ణాలో వచ్చా !"

"గో.... గోదావరిలో.... పో !"

"ఏమిట్రా నీ బొంద, అప్పారావువేనా నువ్వు !"

"ను ... నువ్వు ఎ .... ఎప్పుడో .... చ ... చచ్చిపోయావన్నారుగా ? మళ్ళీ ఎట్లా ఎట్లా వచ్చావ్ !"

"నేను చచ్చిపోవడమేంటిరా ! నీ బొంద! పోయింది పెద సుబ్బారావు నేను చిన సుబ్బారావుని పి. యస్. రావునురా బాబూ ! తలుపు తియ్ తడిసి చలిలో చచ్చిపోతున్నా !"

అప్పారావు రెండడుగులు ముందుకువేసి కిటికీ చువ్వలకు తల ఆనించి బయటకు చూశాడు. తళతళ మెరుపులు. ఢళఢళా ఉరుములు. సుబ్బారావు తడిసి ముద్దయి వణుకుతూ నిలబడి ఉన్నాడు. అప్పారావు గుండెల నిండుగా గాలి పీల్చుకన్నాడు.

"నువ్వట్రా సుబ్బులూ!" అంటూ తలుపు దగ్గరకు వచ్చి తెరిచాడు.

సూట్‌కేసుతో సుబ్బారావు లోపలకు వచ్చాడు,

"ఏమైందిరా నీకు ?" సూట్‌కేసు కింద పెడుతూ అన్నాడు సుబ్బారావు.

అప్పారావు టవల్ తెచ్చి అందించాడు. తలా ముఖం తుడుచుకుంటూ "సూట్ కేసులో బట్టలు కూడా తడిచిపోయినట్టున్నాయ్ !" అన్నాడు సుబ్బారావు.

అప్పారావు లుంగీ, బనీను తెచ్చిచ్చాడు.

"ఏమిట్రా అప్పుడు అంత కంగారు పడిపోయావ్ " అడిగాడు బట్టలు మార్చుకుంటూ సుబ్బారావు.

"అప్పుడు నేను ఏ మూడ్‌లో ఉన్నానో తెలిస్తే ఇలా అడగవు!" అది సరే ! నువ్వు కిటికీ అద్దాలు పగలగొట్టావెందుకురా ?

"నేను అద్దాలు పగలగొట్టటం ఏమిటి తలుపు ఎంత బాదినా నువ్వు తియ్యలేదు. కిటికీ దగ్గరకు వచ్చి నెట్టానో లేదో రెక్కలు భళ్ళున తెరుచుకొన్నాయ్. లోపల బోల్ట్ సరిగ్గా వేసినట్టులేదు. ఆ అదురుకు అద్దాలు పగిలినట్టున్నాయ్. అది సరే ! మూడ్ అంటున్నావ్ ! మన పెద్ద సుబ్బారావ్ గాడు పోయిన సంగతి ఇవాళే తెలిసిందా."

"కాదు. నాలుగు నెలల క్రితమే తెలిసింది"

"మరైతే ఇవ్వాళెందుకురా అంత కంగారు పడ్డావ్?"

"వాడూ....ఎండ్రిన్ తాగి చచ్చిపోయాడు గదరా?" సాలోచనగా అడిగాడు అప్పారావు

"అవును పాపం! వాడి ఫామిలీ పరిస్థితులు ఏమీ బాగాలేవు. అదిసరే! వాడి గురించి ఇప్పుడెందుకురా అంతగా ఆలోచిస్తున్నావ్? మూడ్ బాగా లేదన్నావ్! అందుకేనా?"

